క్లుప్తంగా

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 13 మందికి రెండు రోజులు చొప్పున జైలు, 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1,2 స్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం 24 మంది నిందితులను కోర్టులో హాజరుపర్చారు. నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

యోగా సాధనతో ఆరోగ్యం

కరప: ప్రతి రోజూ కొంత సమయం కేటాయించి, యోగాసనాలు సాధన చేయడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం–జూన్ 21 పురస్కరించుకుని సోమవారం మండలం పాతర్లగడ్డలో రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర–2025 కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో యోగాపై అవగాహన కల్పించేందుకు మాస్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, బండారు మురళి, తుమ్మలపల్లి మాచర్రావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

గురజనాపల్లిలో యోగాంధ్ర

కరప: మండలం గురజనాపల్లిలో సోమవారం ఆయుష్ డాక్టర్ బి.దివ్య, యోగా మాస్టారు పి.లోవరాజు ఆధ్వర్యంలో యోగాంధ్ర–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మాస్ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామి వారికి ప్రీతికరమైన రోజు జేష్ఠ మాసం, త్రయోదశి సోమవారం కావడంతో ఉప ఆలయాలోను అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామి వారిని అమ్మవారిని ఉప ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంబం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలో స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజ్‌గోపాల్ శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం అర్చకులు స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

అన్నవరం: శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామ శివార్లలో గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6.65 లక్షలు విలువ చేసే 133.1 కేజీల గంజాయిని, రవాణా చేయడానికి ఉపయోగించిన మూడు కార్లు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.16,500 నగదు స్వాధీనం చేస్కున్నట్లు పెద్దాపురం డీఎస్పీ డీ శ్రీహరి రాజు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా జీ.మాడుగుల మండలం మగలూరు గ్రామానికి చెందిన పాంగి కృష్ణారావు, గడ్డరాయి గ్రామానికి చెందిన జగ్గందొర గోపాల్, సింగర్ప గ్రామంకు చెందిన గొల్లోరి మత్యరాజ్, ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేశారు. శంఖవరం మండలం నెల్లిపూడి శివారుకు కార్లలో తీసుకు రాగా, వారి వద్ద నుంచి రాజమహేంద్రవరానికి చెందిన కోమలి రామకృష్ణ గంజాయి కొనుగోలు చేసి టయోటా గ్లాంజా కారులో తరలించే ప్రయత్నాల్లో ఉండగా పోలీసులు దాడి చేసి వారిని అరెస్ట్ చేశామన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

సామర్లకోట: ఒంటరిగా జీవిస్తూ స్వయంగా తన పనులు చేసుకోలేని 67 సంవత్సరాల వృద్ధుడిని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సోమవారం కాకినాడ వృద్ధాశ్రమంలో చేర్పించారు. ప్రతిపాడుకు చెందిన వాకపల్లి చిన్నరాజులు ఒంటరి తనంతో బాధపడుతున్న విషయాన్ని గమనించిన డీఎస్పీ డి.శ్రీహరిరాజు సూచనల మేరకు ట్రాఫిక్ ఎస్సై చొరవ తీసుకొన్నారు. గాంధీనగర్‌లోని జానవల్లి స్వచ్ఛంద సేవా సంస్థలో చేర్పించడానికి సంస్థ మేనేజరుతో మాట్లాడారు. ఆ మేరకు అవసరమైన పత్రాలను అందజేశారు. ట్రాఫిక్ ఎస్సై గరగారావు చేస్తున్న సేవలను పలువురు ప్రశంసించారు. ఇటీవల పట్టణ పరిధిలో సుమారు 120 మంది ఆటో డ్రైవర్లకు ఆయన యూనిఫారం అందజేసిన విషయం విదితమే.

ఉపాధి వేతలు

- మండే ఎండలో పనిచేస్తున్నా మంజూరుకాని కూలి
- 8 వారాలుగా కూలీలకు అందని వేతనాలు
- కాకినాడ రూరల్‌లో రూ.2.5 కోట్ల బకాయిలు

కాకినాడ రూరల్: వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామీణ ప్రాంత కూలీలను ఆదుకునే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నేడు కూలీలకు వెతలు మిగిల్చింది. మండుతున్న వేసవి ఎండల వేళ చెమటను చిందించి పని చేస్తున్నా వేతనాలు మాత్రం అందడం లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఒకప్పుడు ఉపాధి హామీ పథకం అంటే ఎంతో ఉత్సాహంగా పాల్గొనే కూలీలు నేడు కూలి సొమ్ము సక్రమంగా రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

3 వేల మందికి ఉపాధి పనులు

కాకినాడ రూరల్ మండలంలో సుమారు 7,600 మందికి ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. సుమారు 3 వేల మంది వరకు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. ఎక్కువ మంది, మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఉపాధి పనులకు వెళుతున్నారు. ఏటా కాలువలు పూడిక తీత, చెరువులు పూడిక తీత పనుల్లో ఉపాధి కూలీలు పాల్గొంటున్నారు. ఈ ఏడాది 2025– 26కు సంబంధించి మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిపాదిత ఉపాధి పనుల్లో సుమారు 350 పనుల్లో కూలీలు పాల్గొంటున్నారు. వీరికి పని గంటలు, చేసే పని కొలతల ఆధారంగా వేతనం అందివ్వనున్నారు. గరిష్టంగా రోజుకు రూ.307 కూలి పొందే అవకాశం ఉంది.

పనులు చేయడమే తప్ప వేతనాలు లేవు

ఉపాధి కూలీలకు వేతనాలు సాధారణంగా వారం లేదా రెండు వారాల్లో వారి ఖాతాల్లోనే జమ చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి మారిపోయింది. పనులు చేసి 8 వారాలు అంటే దాదాపు నెలన్నర రోజులు పైబడినా వేతనాలు జమ కావడం లేదు. దీనిపై ఉపాధి సిబ్బంది సమాధానం చెప్పలేని పరిస్థితి దాపురించింది. కాకినాడ రూరల్‌లో సుమారు రూ.2.50 కోట్లు ఉపాధి కూలీ సొమ్ములు బకాయిలు ఉన్నాయి. నియోజకవర్గంలోని కరప మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కరప మండలంలో ఉపాది కూలి సొమ్ములు జమ చేయలేదని తక్షణం జమ చేయాలని అక్కడ కూలీలు అధికారులను వేడుకుంటున్నారు.



కాకినాడ రూరల్‌లో ఉపాధి పనుల్లో కూలీలు



వేతనాలు తక్షణం చెల్లించాలి



ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారంతా చాలా పేద వారు. వ్యవసాయ పనులు లేని సమయంలో పొట్టకూటి కోసం ఉపాధి పనులకు వెళుతున్నాం. ఆ సొమ్ములతోనే కుటుంబం గడుస్తుంది. చాలా వారాలుగా ఉపాధి కూలి సొమ్ములు ఇవ్వడం లేదు. అధికారులు తక్షణం కూలి సొమ్ములు అందించే ఏర్పాటు చేయాలి.

– నందిపాటి చిన్నారావు, ఉపాధి హామీ కూలి, పండూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఉపాధి పనులు చేసే కూలీలకు దాదాపు 8వారాలుగా వేతన బకాయిలు ఉన్నాయి. దాదాపు రూ.2.5 కోట్లు వారికి ఇవ్వాల్సి ఉంది. కూలి సొమ్ముల కోసం గ్రామాల్లో ఉపాధి సిబ్బందిపై ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– విఘ్నేశ్వరరావు, ఇన్‌చార్జి ఏపీఓ, కాకినాడ రూరల్

మత్స్యకార పేటల్లో మౌలిక సదుపాయాల కరవు

కాకినాడ సిటీ: పట్టణంలోని మత్స్యకార పేటల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో టీడీపీ ఎమ్మెల్యే, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విఫలమయ్యారని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ విమర్శించారు. కాకినాడ పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిగా నెరవేర్చలేకపోయిందన్నారు. ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ ఇంటింటికీ కుళాయి వేయిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. మత్స్యకారుల పేటల్లో ప్రజలు నేటికీ కుళాయిలు లేకపోవడంతో వాటర్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నారన్నారు. కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) పలు దఫాలు ఎన్నికైనా నేటికీ మత్స్యకార ప్రజల జీవితాలు ఏమాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 30న కాకినాడ కలెక్టరేట్ వద్ద మత్స్యకారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెరిగిన ధరలు, అధిక పన్నుల భారానికి తగ్గించాలని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి శివకోటి రాజు, శ్రీను, ప్రేమ్‌కుమార్, వి మంగ, వరలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఏడాదిలో సగటున రెండు రోజులకు ఒకటి చొప్పున 188 మంది మహిళలు అత్యాచారానికి గురయ్యారని, 15 మంది అత్యాచారం అనంతరం హత్యకు గురయ్యారని ఇన్ని అఘాయిత్యాలు జరిగినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు చూస్తోందని ఆమె మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన చంబల్ లోయ దురాగతాలను తలపిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర పోలీస్ యంత్రాంగం రెడ్ బుక్ సేవలోనే తరిస్తోందని ఆమె విమర్శించారు.

ప్రైవేటు వ్యక్తి చేసిన ఆరోపణలను సాక్షి చానల్‌కు ఆపాదించారు

ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ఎవరో ప్రైవేటు వ్యక్తి అమరావతిపై చేసిన వ్యాఖ్యలను సాక్షి చానల్‌కు ఆపాదించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఆయన భార్య వైఎస్ భారతిని లక్ష్యంగా రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా మహిళలు, బాలికలపై లైంగిక దాడులు అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యం అయ్యాయని వీటిపై పెదవి విప్పని కూటమి నాయకులు, మహిళా నేతలు ప్రతిపక్షంపై అసత్య ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సాక్షి చానల్‌ను, యాంకర్ కొమ్మినేనిని లక్ష్యంగా చేసుకొని రాష్ట్రంలో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని ఆమె విమర్శించారు. జగన్ తన కుమార్తెను చూసేందుకు లండన్ వెళ్లినప్పుడు నారా లోకేష్ ఆయనపై చేసిన అనుచిత వ్యాఖ్యలు మహిళలను అగౌరవపరిచే విధంగా లేవా? అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దిశ చట్టం ద్వారా బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించారని గుర్తు చేశారు. మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించలేని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏ విధంగా రక్షించగలుగుతుందని ఆమె ప్రశ్నించారు.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: విశాఖ ఉక్కు పరిశ్రమంలో అన్యాయంగా తొలగించిన 5,400 మంది కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు పోరాటంపై తీవ్ర ఆంక్షలు విధిస్తూ ఉక్కు పరిశ్రమ లోపల రాష్ట్ర పోలీసులను మోహరించి పోరాడే కార్మికులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని ఆందోళనకారులు విమర్శించారు. బీజేపీ ప్రైవేటీకరణ విధానాలకు చంద్రబాబు తల ఊపుతూ ప్రజాస్వామిక పోరాటాన్ని అడ్డుకుంటూ రాష్ట్ర ప్రజల ప్రాణ త్యాగాలను అవమానించారన్నారు. ఇప్పటికీ పరిశ్రమ నెలకొల్పని ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ కోసం కేంద్రం ఇనుప గనులు కేటాయించాలని సిఫారసు చేసిన చంద్రబాబు విశాఖ ఉక్కు గనుల కేటాయింపు విషయం ఎందుకు ప్రస్తావించలేదని ఆందోళనకారులు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు జి బేబీరాణి, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, టి రాజా, కె సత్తిరాజు, చివుకుల వెంకటరావు, దుంపల ప్రసాద్, వర్మ, ఆర్‌రాఘవులు, జి దుర్గారావు, శ్రీపాదం సత్తిబాబు, ఆదినారాయణ, రాజు రాము, గొడుగు సత్యనారాయణ, ఎస్ నాగరాజు, బంగారు రాజేష్, జలిపెల్లి అప్పన్న, కటారి నాగేశ్వరరావు, కె రవీంద్ర, నాగేశ్వరరావు, సింగంపల్లి దుర్గ, గాదిరాజు వరలక్ష్మి పాల్గొన్నారు.

చిరంజీవినీకుమారి ఆశయాలను నెరవేర్చాలి



డాక్టర్ చిరంజీవినీకుమారి సంతాప సభలో మాట్లాడుతున్న స్టాలిన్

కాకినాడ సిటీ: ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి, సామాజిక సేవకురాలు డాక్టర్ పి చిరంజీవినీ కుమారి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని వాటిని నెరవేర్చేందుకు కృషి చేయాలని సీపీఐ సీనియర్ నేత డాక్టర్ చెలికాని స్టాలిన్ పిలుపునిచ్చారు. సోమవారం కాకినాడ ఐడియల్ కళాశాల ప్రాంగణంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడి రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా చిరంజీవిని కుమారి చిత్రపటం వద్ద వివిధ రంగాల ప్రముఖులు, సామాజికవేత్తలు నివాళులర్పించారు. డాక్టర్ చిరంజీవినీ కుమారి వామపక్ష, అభ్యుదయ ఉద్యమాల శ్రేయోభిలాషి సాహిత్య, అభిలాషి, నిరంతరం చరిత్ర అధ్యయన శీలి అని స్టాలిన్ కొనియాడారు. సీపీఐ రాష్ట్ర నాయకులు తాటిపాక మధు మాట్లాడుతూ మానవ సమాజం బాగుండాలని నిరంతరం ఆమె తపన పడేవారన్నారు. విద్యార్థి ఉద్యమాలను చిరంజీవినీకుమారి ప్రోత్సహించేవారన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి సుగుణరెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు పి సుబ్బరాజు, చింతపల్లి సుబ్బారావు, సీపీఎం నాయకులు దువ్వాశేషుబాబ్జీ, వీరబాబు, రాజా, బ్యాంకు నాయకులు కె ఆదినారాయణమూర్తి, వక్కలంక రామకృష్ణ, చల్లపల్లి రవి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

11న వికాసలో ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈనెల 11న బుధవారం వికాస కార్యాలయంలో అనంతపురంలోని హ్యుండయ్ గ్లోవిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో టెక్నీషియన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు సోమవారం తెలిపారు. ఈ ఉద్యోగానికి ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులై, డిప్లొమో, బీటెక్ పూర్తి చేసిన 30 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. డిప్లొమో, బీటెక్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13,200 జీతం, రూ.2 వేలు అటెండెన్స్ బోనస్, ఉచిత భోజనం, రవాణా సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తిల అభ్యర్థులు ఈనెల 11వ తేదీ బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావాలని పీడీ లచ్చారావు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

బోట్‌క్లబ్: నగరంలో ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ తమ ఆందోళనను తీవ్రం చేశారు. సోమవారం మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ స్మార్ట్ సిటీ కార్యాలయం నుంచి మూడు లైట్ల జంక్షన్, రామారావుపేట జంక్షన్, పొట్టి శ్రీరాములు విగ్రహం జంక్షన్, జిల్లా పరిషత్ సర్కిల్, ఆర్డీవో కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయం మీదుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. తమ సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులకు కనువిప్పు కల్పించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు తుమ్మలపల్లి శ్రీధర్ మాట్లాడుతూ 25 ఏళ్లగా తక్కువ జీతంలో పనిచేస్తున్నామని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బత్తుల శివశంకర్, యక్కల శ్రీనివాసరావు, కుడిపుడి వీరభద్రరావు, పాలిక వీవీ సత్యనారాయణ, అప్పలరాజు, నాగేశ్, వై.శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, వి.వి సతీష్, కె. భద్రం, డి.ప్రసాద్, సూరిబాబు పాల్గొన్నారు .

ప్రతిభావంతులకు షైనింగ్ స్టార్ అవార్డులు

బాలాజీచెరువు: పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న షైనింగ్ స్టార్ అవార్డును ప్రగతి పాఠశాల విద్యార్థులు అందుకున్నారని సంస్థ చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు తెలిపారు. విద్యార్థులు ఎం.ఎల్.పి.సమన్విత, కే వీరరాఘవేంద్ర, కే రాజకుమారి, ఐవీఎస్ కావ్యశ్రీ, ఎస్.నవ్య, ఎస్.ప్రవలిక, ఎన్.యస్.వర్షశ్రీ అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు. ఇంటర్ విభాగంలో వి.నందిని (ఎంపీసీ), కేఎస్ఎస్‌పీ బిందు, (బైపీసీ), పి.శ్యామల (సీఈసీ), ఎస్.కే.షామ్‌సూన్ (సీఈసీ) ఎంపికయ్యారని చెప్పారు. ఏపీ ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో డీకే గణేష్ 670 ర్యాంక్ సాధించినట్టు తెలిపారు. ప్రతిభావంతులను జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం సత్కరించి అవార్డులు అందజేసారని పాఠశాల చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు తెలిపారు.విద్యార్థులను పాఠశాల డైరక్టర్లు హిమబిందు, శ్వేతబిందు, ఏజీఎం అనిల్‌బాబు, సదాశివరావు తదితరులు అభినందించారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కల్యాణోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ సమీపంలోని రామాలయం ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పెళ్లి కొడుకు, పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు వార్షిక బ్రహ్మోత్సవ తిరు కల్యాణం నిర్వహించనున్నట్టు కమిటీ బాధ్యులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

కరప: స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు వెళ్లిన విద్యార్థిని ఇంటికి తిరిగిరాకపోవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కరప పోలీసులు తెలిపారు. కరపలో నివాసం ఉంటున్న బంజారా లీలకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. ఆమె పెద్ద కుమార్తె పాయల్ కరప హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఆమె ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైస్కూల్లో చదువుతున్న స్నేహితురాలు పుట్టినరోజు వేడుకకు వెళుతున్నట్టు ఇంటి వద్ద చెప్పి వెళ్లింది. తర్వాత ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కరప, పరిసర గ్రామాల్లో గాలించినా కనబడకపోవడంతో సోమవారం తల్లి లీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మాళ్వార్‌కు ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: నమ్మాళ్వార్‌కు తిరు నక్షత్రం సందర్భంగా సోమవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో నమ్మాళ్వార్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



కరప పీహెచ్‌సీలో గర్భిణులకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

కరప: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, వైద్యుల సలహాల మేరకు పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ సయ్యద్ ఖతీజా సత్తారి అఫ్రోజ్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె గర్భిణు లకు వైద్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. పీహెచ్‌సీ సిబ్బంది గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ, సుగరు టెస్టులు నిర్వహించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి తగు సూచనలు చేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు సూచనల మేరకు సూర్య గ్లోబల్ హాస్పిటల్ ఏఓ కె.తిరుపతిరావు, మార్కెటింగ్ మేనేజర్ డి.అశోక్ కరప పీహెచ్‌సీకి వచ్చి పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి, గర్భిణిలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పీహెచ్‌సీ సిబ్బంది జి.యేసురత్నం, డీవీవీ సత్యనారాయణమ్మ, కె.రాజగోపాలరావు పాల్గొన్నారు. వేళంగి పీహెచ్‌సీలో గర్భిణులకు డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ వైద్యపరీక్షలు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వ విధానాలపై పోరాడాలి



జక్కంపూడి రాజాను కలసిన జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్‌కుమార్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కూటమి ప్రభుత్వ విధానాలపై పోరాటం సాగిస్తూ రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్ కుమార్ (బన్ని) మర్యాదపూర్వకంగా రాజాను కలుసుకున్నారు. రాజాతోపాటు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సిద్ధార్థను ఆయన కలుసుకున్నారు.

ఏలేరులో కాలుష్య జలాలు



కాలుష్య జలాలతో సామర్లకోట మీదుగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ

- నీరు కలుషితమవడంతో దుర్గంధం
- పశువులకు నీరు లేక విలవిల
- పట్టించుకోని పొల్యూషన్ అధికారులు

సామర్లకోట: పెద్దాపురం మండల పరిధిలో ఉన్న వివిధ పరిశ్రమల వ్యర్థ జాలలను ఏలేరు కాలువలోనికి నేరుగా విడిచి పెడుతున్నారు. దాంతో ఏలేరు కాలువ వెంబడి బరించలేని చెడు వాసన వస్తుంది. పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు విచ్చలవిడిగా విడిచి పెడుతున్నా అధికారులు పట్టించుకొవడం లేదు. ఏలేరు కాలువలో నీరు సామర్లకోట, చంద్రంపాలెం కాపవరం, పవర, పండ్రవాడ, నవర, తమ్మారం, పెనుమర్తి, నేమాం మీదుగా ఏలేరు కాలువలో నీరు సముద్రంలోకి కలుస్తుంది. ఆయా గ్రామాలలోని రైతులకు చెందిన పశువులు ఏలేరు కాలువలో నీటిని తాగునీరుగా ఉపయోగించుకొంటాయి. భరించలేని చెడు వాసనతో కాలుష్య జలాలతో ఏలేరు కాలువ నిండి పొవడంతో పశువులకు నీరు అందక పశువులు విలవిలాడి పోతున్నాయని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రసాయిన వ్యర్ధ పదార్ధాలతో నిండిన ఏలేరు కాలువలోనికి దిగిన పశువుల కాళ్లకు పుండ్లు పడిపొతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలుష్య జలాలను నివారించాలి



ఏలేరు కాలువ నీటిని రైతులు ఎక్కువగా పంట సాగుకు, పశువులకు ఉపయోగిస్తుంటారు. ఈ కాలువ పెద్దాపురం మండలంలోకి వచ్చే సరికి కాలుష్య జలాలతో నిండి పొయి మండలం పరిధిలో అనేక గ్రామాల మీదుగా పవాహిస్తుంది. కాలుష్యం కారణంగా పశువులకు తాగునీరు లేని పరిస్థితి ఏర్పడింది. అనేక గ్రామాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేసినా వాటిలోను నీరు నింపే నాధుడు కనిపించడం లేదు.

ఎం చక్రవర్తి, మాజీ సర్పంచ్, కాపవరం